సొసైటీలకు మరో 40 రోజులు ఇన్‌చార్జిలే

ప్రత్యేకాధికారుల పాలన కొనసాగింపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

విశాలాంధ్ర - జామి: ప్రాథమిక సహకార సంఘాలకు ఇప్పట్లో కమిటీల నియామకం లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఉన్న ప్రత్యేక పాలన ముగియడంతో మరో 40రోజులపాటు ప్రత్యేకపాలన ప్రకటించింది. దీంతో పిఎసిఎస్ నామినేటెడ్ కమిటీలపై ఆశలు పెట్టుకున్న నేతల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్ళు చల్లింది. జిల్లాలో 94 పిఎసిఎస్‌లు ఉన్నాయి. వీటికి 2019నుంచి సహకార ఎన్నికలను గత ప్రభుత్వం నిర్వహించక పోవడంతోపాటు నామినేటెడ్ కమిటీలతో కాలయాపన చేసింది. కమిటీల పదవీకాలం గతేడాది డిసెంబర్‌నాటికి పూర్తికాగా తిరిగి అధికారులనే ప్రత్యేకాధికారులుగా నియమించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం మొదటి సారిగా పిఎసిఎస్ ఎన్నికల అవకాశం వచ్చినా ఎన్నికలను నిర్వహించకుండా కూటమి పార్టీలలో పలువురు నేతలకు పిఎసిఎస్ పదవులతో కమిటీలను ప్రకటిస్తారని అందరూ భావించారు. కానీ అనూహ్యరీతిలో కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారుల పాలననే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో సహకార శాఖ సిబ్బంది ఎంతో ఉత్కంఠగా ఎదురు చూసిన ప్రకటన వెలువడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

డిసిసిబి చైర్మన్ నియామకం జరిగినా..

ప్రస్తుతం అన్ని జిల్లాలతోపాటు విజయనగరం జిల్లాకు డిసిసిబి చైర్మన్ నియమాకం జరిగింది. చైర్మన్‌గా కిమిడి నాగార్జున పదవీబాధ్యతలు స్వీకరించారు. దీంతో తాజాగా పిఎసిఎస్‌ల కమిటీలపై నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఈనెల 20తో ప్రత్యేక పాలన గడువు ముగియడంతో కమిటీల ప్రకటనకు ఎదురు చూసారు. కానీ జూలై నెలాఖరువరకు అధికారుల పాలనను పొడిగించారు. దీంతో మరో 40రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు మొదటి వారంలో సొసైటీలకు నామినేటెడ్ పదవులను ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ నేతలు చెప్పుకుంటున్నారు.

న్యాయం చేస్తారా... ఇక్కడే చావమంటారా..!

ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించిన బిరసాడవలస గ్రామస్తులు

విశాలాంధ్ర - మెంటాడ: 18 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వ అధికారులలో ఎటువంటి చలనం లేదని దుర్వాసన భరించలేకపోతున్నామని మాకు న్యాయం చేస్తారా లేక ఇక్కడే చావమంటారా ఏదో ఒకటి తేల్చాలని జనసేన మండల అధ్యక్షులు సబ్బవరపు రాజశేఖర్ ఆధ్వర్యంలో బిరసాడవలస గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. బిరసాడవలస గ్రామాన్ని ఆనుకుని ఉన్న కోళ్ల ఫారం నుండి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నామని ఈ దుర్గంధం నుండి తమకు విముక్తి కలిగించాలని, కోళ్ల ఫారం ఇక్కడ నుండి తొలగించాలని, 18 రోజుల నుండి జనసేన మండల అధ్యక్షుడు సబ్బవరపు రాజశేఖర్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వ అధికారులలో ఎటువంటి స్పందన లేదని ఇక చావే శరణ్యమని అన్నారు. కోళ్ల ఫారం గ్రామానికి రెండు కిలోమీటర్లు దూరంలో ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ పక్కనే ఉన్న కోళ్ల ఫారంను తొలగించడానికి అధికారులు ఎందుకు ఆలోచిస్తున్నారని అధికారులను నిలదీశారు. పగలు రాత్రులు అనే తేడా లేకుండా దోమలు, ఈగలతో సతమతమవుతున్నామని, ఎంత వేడుకుంటున్నప్పటికీ అధికారులకు తమపై కనికరం రావడం లేదని అన్నారు. జనసేన మండల అధ్యక్షుడు సబ్బరపు రాజశేఖర్, సిపిఎం పార్టీ నాయకులు రాకోటి రాములు ఆధ్వర్యంలో ధర్నాలను, దీక్షలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో ఏ.భానుమూర్తి స్పందిస్తూ ఈ విషయమై పూర్తి వివరాలు సేకరించి బిరసాడవలస గ్రామస్తులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రాకోటి రాము, టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఎస్‌విఎన్ లేక్ ప్యాలస్‌లో జరిగింది. మహారాజ ప్రభుత్వ సంస్కృత, ఉన్నత పాఠశాలలో 1998లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 27 ఏళ్ళ తరువాత కలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన అలనాటి గురువులు పద్మావతి, సూర్యరావు, సత్యనారాయణమూర్తి, రాజేశ్వరరావు, సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. ఒక్కొక్కరిగా చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి చేయాల్సిన సేవలపై నిర్ణయాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, రవికుమార్, ఉషాకిరణ్, శశిధర్, వీకే నరసింహం, భారతీదేవి, శివ, వినోద్ హాజరయ్యారు.

తాటిపూడి రిజర్వాయర్ నీటి తరలింపు తగదు

విశాలాంధ్ర - గంట్యాడ: తాటిపూడి రిజర్వాయర్ సాగునీటి ప్రాజెక్టుని కొన్ని తప్పుడు ఒప్పందాలతో తాగునీటిని విశాఖకు తరలిస్తూ తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాల విశాఖపట్నంతో తాగునీరు ఒప్పందం కుదుర్చుకున్నారని, కానీ నేటికీ తాగునీరు తరలిస్తున్నారన్నారు. విశాఖ జీవీఎంసీ వారు ప్రైవేటు కంపెనీలకు నీటిని అమ్ముకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అల్యూమినియం కంపెనీకి నీళ్ల తరలించడానికి పావుల కదుపుతున్నారని, దీనిని అడ్డుకోకపోతే సాగునీటికి నీళ్ల ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టు రైతు సంఘ నాయకులు స్థానిక ఎమ్మెల్సీ రఘురాజు, అల్లు జోగి నాయుడు, రైతు సంఘం నాయకులు రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి సహకరించండి

- మున్సిపల్ చైర్మన్ ఆర్.శరత్ బాబు

విశాలాంధ్ర - బొబ్బిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్‌లు రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బేబి నాయన ఆదేశాల ప్రకారం పురపాలక సంఘ పరిధిలో ఉన్న 14వ వార్డు పూల్ బాగ్ బైపాస్ రోడ్డు దగ్గర 6 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించబోయే సీసీ డ్రైన్‌కు, 20వ వార్డు మెహర్ కాలనీలో డిగ్రీ కళాశాల వద్ద రోడ్డు, మరివి తిరుపతి నాయుడు ఇంటి వద్ద రోడ్డులను సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించబోయే సి.సి రోడ్ల నిర్మాణానికి శరత్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు మాట్లాడుతూ బొబ్బిలి పురపాలక సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో సోమవారం డి.గదబవలస గ్రామంలో కాంట్రాక్టు విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి పోరాపు రామకృష్ణ(19) మరణించాడు. ఈయన గంగన్నపాడు గ్రామానికి చెందిన వ్యక్తి. విద్యుత్ పనుల కోసం కాంట్రాక్టర్ వద్ద పనులు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, కుటుంబస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై స్థానిక ఎస్సై జి.సాగర్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బాడంగి కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

నెల్లిమర్లలో పెట్టుబడి పెట్టండి: ఎమ్మెల్యే మాధవి

నేడు ఇన్వెస్టర్స్ మీట్ 2025

విశాలాంధ్ర - భోగాపురం: నెల్లిమర్ల నియోజక వర్గంలో పెట్టుబడులు పెట్టాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పిలుపునిచ్చారు. ఉద్యోగావకాశాలు, పారిశ్రామికాభివృద్ధి, యువత కోసం సుస్థిరమైన భవిష్యత్తు లక్ష్యంగా నెల్లిమర్లలో ఇన్వెస్టర్స్ మీట్ - 2025ను జూన్ 24న ముంజేరు మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పథంలో భాగస్వాములవ్వాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అందరూ ఈ సమావేశానికి తరలి రావాలని కోరారు.

జిందాల్ భూముల్లో కొత్త పరిశ్రమలను అడ్డుకోకండి

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండల పరిధిలోని కిల్తంపాలెం, చీడిపాలెం, పెద ఖండేపల్లి, మూల బొడ్డవర, ముసిడిపల్లి ప్రాంతాల్లో 2008లో సేకరించిన భూమిని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అల్యూమినా కర్మాగారం ఏర్పాటు కోసం 1048 ఎకరాల 65 సెంట్లను భూ సేకరణ చేసి జిందాల్ యజమానికి ఇచ్చేసారని అప్పటినుంచి ఇప్పటి వరకూ దాదాపు 17 సంవత్సరాలు కర్మాగారం పెట్టలేని జిందాల్ యజమానులు కొత్తగా ఎమ్.ఎస్.ఎమ్.ఈ పార్కు ల పేరుతో పెట్టబోయే నూతన పరిశ్రమలను రైతులు అడ్డుకోకుండా జిల్లా అభివృద్ధికి, యువత ఉపాధికి సహకారాన్ని అందించాలని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. సోమవారం అడ్డతీగ గ్రామంలో భూ నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సుమారు 3,970 కోట్ల తో 45 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 10 చిన్న, మధ్యతరగతి, సూక్ష్మ పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని రైతులు తమ ఆందోళన విరమించి తమకు కావలసిన డిమాండ్ల కోసం శాంతియుత చర్చలు చేయాలని భీశెట్టి కోరారు. జిందాల్ యాజమాన్యం తీరుతో నేటికీ చాలామంది భూములు కోల్పోయిన రైతులు డబ్బులు అందక ఆందోళన చెందుతున్నారని అన్నారు. పరిశ్రమల అవసరాన్ని ప్రజలు గుర్తించకపోతే ప్రమాదమని అయన అన్నారు. తమ స్వార్ధ రాజకీయాల కోసం ప్రధాన రాజకీయ పార్టీల నేతలు చెప్పే మాటలు ప్రజలు లోతుగా అధ్యయనం చెయ్యాలని కోరారు. ఈ సమావేశంలో లోక్ సత్తా నియోజకవర్గ అధ్యక్షుడు కాండ్రేగుల ప్రసాద్, పౌర వేదిక ఉపాధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు, జిందాల్ భూ బాధితులు మోహన్, అప్పారావు, మాజీ ఎంపీటీసీ అరుణ, సత్యనారాయణ రాజు, ఒలం మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిందాల్ భూమి ఇచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో హామీలు నెరవేర్చాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గిరిజన జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తుమ్మి అప్పలరాజు దొర ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గం ఎస్.కోట మండలం జిందాల్ సంస్థకు 2008-09 మధ్యకాలంలో 1164 ఎకరాలు భూమిని (864 డి పట్టా 150ఎకరాలు జిరాయితీ 150ఎకరాలు ప్రభుత్వ భూమి) ఇచ్చారన్నారు. గత పదహారేళ్లుగా ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదని, కంపెనీ కూడా నిర్మాణం జరగలేదన్నారు. ఈమధ్య కాలంలో ఎంఎస్ఎంఈ పార్క్‌కి కేటాయిస్తున్నారని తెలిసాక గిరిజన రైతులందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కంపెనీల అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదని కాకాపోతే మాకు ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదని, గిరిజనులు జిందాల్ భూముల వద్దకు వెళ్తుండంగా పోలీస్‌లు ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం నాలుగు గంటలవరకు అడ్డుకోవడం అన్యాయమన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యేకోళ్ల లలితకుమారి వచ్చి నాలుగు రోజుల సమయం ఇస్తే ప్రతి గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి మీకు రావాల్సిన పరిహారం మీకు వచ్చేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా జిందాల్ భూమి రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు.

47వ రోజు మున్సిపల్ కార్మికుల సమ్మె

విశాలాంధ్ర - రాజాం: గత 47 రోజులుగా వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల ఆకలి కేకలు, ఆర్తనాదాలతో చేస్తున్న పోరాటం రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించకపోవడం వినిపించకపోవడం దుర్మార్గమని తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ పట్టణాల్లో ఉన్న ప్రజలు అత్యవసర సేవలు మంచినీళ్లు, కరెంటు లేక అల్లాడిపోతూ తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నా చీమకుట్టినట్టు కూడా లేకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హరిబాబు, అనిల్, మరియదాసు, కృష్ణ, గణపతి, మోహన్, రామకృష్ణ, ప్రసన శారద, లక్ష్మి, మహేష్, సత్యనారాయణ, సోమేష్, రాజు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుంటే జూలై 1 నుండి పనులు నిలిపివేత

మధ్యాహ్న భోజన పథక రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: బకాయి పడ్డ బిల్లులు ఈనెలలో చెల్లించకుంటే జూలై 1 నుండి పనులు నిలిపివేస్తామని మధ్యాహ్న భోజన పథకం (ఏఐటియుసి) రాష్ట్ర అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి కే.స్రవంతి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా కేవలం సేవా దృక్పథంతో అనేక ఇబ్బందులు పడుతూ నెట్టుకొస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహ కులకు నాలుగు నెలలుగా మెస్ బిల్లులు, గౌరవ వేతనాలు ఇవ్వకపోవడం వల్ల కార్మికులంతా అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఈ నెలాఖరులోగా బిల్లులు చెల్లించకుంటే జూలై 1 నుండి పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. వీటికి సంబంధించిన బడ్జెట్ విడుదల చేయాలని అధికారులకు అనేకసార్లు తెలిపినప్పటికీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్నా వేధింపులు తప్పడం లేదన్నారు. మధ్యాహ్న భోజన పథక కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కనీస వేతనం కార్మికులకు అమలయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉంగరాల జయలక్ష్మి, కార్యదర్శి పి.లక్ష్మీ, రాజి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

విశాలాంధ్ర - నెల్లిమర్ల: బీజేపీ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నెల్లిమర్ల పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మైపాడ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ప్రసాద్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరీ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

26వసారి రక్తదానం చేసిన బూర్లె

విశాలాంధ్ర - గుర్ల: విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామస్ ముద్దులు గారాల పట్టి

అయినటువంటి షేక్ మైరా పుట్టినరోజు సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఎస్‌విఎన్ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లా గుర్ల మండలం, గురునాయుడు పేట గ్రామానికి చెందిన స్వాస్ సేవా సంఘం అధ్యక్షులు బూర్లె పైడినాయుడు 26వ సారి రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామస్, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపి, ఎస్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, శ్రీ విజయ దుర్గ ఫౌండేషన్ అధ్యక్షురాలు చంద్రిక, బొమ్మాళి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.10000 జరిమానా

విశాలాంధ్ర - రామభద్రపురం: మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన కేసులో ఒక వ్యక్తికి 10వేలు రూపాయలు జరిమానా విధించబడిందని స్థానిక ఎస్సై వెలమల ప్రసాదు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని చిన్న నేరెళ్లవలస గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇటీవల వాహనాల తనిఖీల్లో భాగంగా తనిఖీ చేయగా అతను మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడని నిర్ధారణ అయింది. అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసి సాలూరు కోర్టులో హాజరుపరచగా సోమవారం అతనికి న్యాయమూర్తి జరిమానా విధించారు. అలాగే ఎవరైనా మద్యం సేవించి వాహనాన్ని నడిపితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అలాగే సదరు వ్యక్తికి రాజకీయ వ్యక్తుల నుంచి రాయబారాల పంపిన వదిలేది లేదని కరాకండిగా ఎస్సై తేల్చి చెప్పారు.

గురుకులాలలో మిగులు సీట్లకు రాతపరీక్ష

ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త రూపావతి వెల్లడి

విశాలాంధ్ర - విజయనగరం: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలలో ఉన్న డా. బి.అర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతిలో మిగిలియున్న సీట్ల అడ్మిషన్ కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఉమ్మడి జిల్లాల

వ్యాప్తంగా ఈనెల 25న రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త రూపావతి వెల్లడించారు. బాలురుకు కొప్పెర్లలోనూ, బాలికలకు నెల్లిమర్ల లోనూ 6వ తరగతి, 7వ తరగతికి ఉదయం 10గంటల నుండి11 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా 8వ తరగతికి, 9వ తరగతికి అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 3 గంటల వరకు పరీక్ష జరుగుతుందని వివరించారు. ప్రతి తరగతి యొక్క ప్రశ్న పత్రం ముందు తరగతిలో ఉన్న సిలబస్ అనగా లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జక్ట్స్ మీద ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నపత్రం ఉంటుందని ఆమె తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని, బ్లూ బ్లాక్ పెన్స్, ప్లాంక్‌తో హాజరవ్వాలని తెలిపారు.

సాగుదారులకు హక్కు పత్రాలు అందించాలి

విశాలాంధ్ర - డెంకాడ: పంట సాగు చేస్తున్న సాగుదారులకు హక్కు పత్రాలు అందించాలని తహశీల్దార్ రాజారావు, వ్యవసాయ అధికారి టి.సంగీత అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో ఇప్పటికే సర్వే నంబర్ ప్రతిపాదికన 118 అలాగే ఎల్‌పీఓ ప్రతిపాదికన రెండు కార్డులు మాత్రమే జారీ చేయడం జరిగిందని తెలిపారు. టార్గెట్స్ వారిగా ఇంకా రైతులను గుర్తించి వారికి పంట

సాగుదారుల హక్కు పత్రాలను అందించి ఇంకా ఎక్కువ సంఖ్యలో జారీ చేయాలని ఆదేశించారు. ఈ ఖరీఫ్ సీజన్‌కి పంటల బీమాకు సంబంధించి ఓ గ్రామం ఒక యూనిట్‌గా పరిగణించి ఎకరాకు 200 రూపాయలు చొప్పున ఆగస్టు 15వ తేదీ లోపు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పాడి పశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం

పశు సంవర్ధక సంయుక్త సంచాలకులు డాక్టర్ వై.వి.రమణ

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పాడి పశువుల ఆరోగ్యంపై రైతులు దృష్టిసారించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ వైవి రమణ కోరారు. ఈ సందర్భంగా ఆయన విశాలాంధ్ర ప్రతినిధితో మాట్లా డుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వర్షాలు వల్ల పాడి పశువుల ఆరోగ్యంపై కొన్ని రకాలైన దుష్ప్రభావం పడుతుందని ఆయన తెలిపారు.

నీటి లభ్యత అవసరం: పాడి పశువులకు నీటి లభ్యత అతి ముఖ్యం. పశువు ప్రతి 50 కిలోల శరీర బరువుకు సుమారు 7-8 లీటర్ల నీరు అవసరం. ఈ మేరకు తగినంత మంచి నీరు అందుబాటులో లేనప్పుడు అవి కలుషిత నీటిని తాగే ప్రమాదం ఉంటుంది. ఈ నీటిలో ఈ కోలై వంటి ప్రమాదకరమైన పరాన్న జీవులు పశువుల్లో రోగాలను వ్యాప్తి చేస్తాయి.

దరి చేరే రోగాలు

- గొంతు వాపు వ్యాధి: వర్షాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా దున్నలు గేదెలలో వస్తుంది. నీరసంగా వున్న పశువులకు ఈ వ్యాధి త్వరగా సోకుతుంది. వల్లపు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచే ప్రాంతాలలో పశువులలో ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధిని 'గురక వ్యాధి" అని కుడా పిలుస్తారు.

వ్యాధి లక్షణాలు: పశువు ఆయాస పడుతూ శ్వాశ తీసుకునేటప్పుడు గుర్రు గుర్రు మని శబ్దం వస్తుంది.

నాలుక బయటకు తీస్తూ శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. పశువు 24 గంటలలో చనిపోతుంది.

గొంతు పైన, మెడ క్రింద భాగాలలో వాపు వుంటుంది. కళ్ళు ఎర్రబడి నీరు కారుతుంది. లి జ్వర తీవ్రత 104 - 106 పెరిగి పశువు చనిపోతుంది.

ఎలా నివారించాలి :

వర్షా కాలం ముందు జూన్, జూలై నెలాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

పుష్టికరమైన ఆహారం ఇవ్వాలి. బలహీనంగా వుంటే పశువులు త్వరగా వ్యాధికి గురి అవుతాయి. వ్యాధి సోకిన పశువులను మంద నుండి వేరు చేయాలి.

పాకలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి.చనిపోయిన పశువును గోతిలో పూడ్చాలి.

- జబ్బవాపు వ్యాధి: ఆరోగ్యంగా, బలంగా వుండి పశువులలో ఈ వ్యాధి తొలకరి చినుకులు పడ్డ తరువాత వస్తుంది. తెల్లజాతి పశువులలో ఎక్కువగా వస్తుంది.

వ్యాధి లక్షణాలు: 6 మాసాల నుండి 2 సంవత్సరాల వయసు గల బలంగా, ఆరోగ్యంగా వున్న పశువులలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది .చిన్న పశువులు ఆకస్మాత్తుగా మరణిస్తాయి. జబ్బ, తొడ కండరాలు పైన వాపు వుండి, వేడి గాను, నొప్పిగాను వుంటుంది. వాపు వున్న చోట తాకితే కరకరమని శబ్దం వస్తుంది. పశువు నీరసంగా వుండి ఆకలి మందగిస్తుంది. జ్వర తీవ్రత 104 - 106 పెరిగి పశువు చనిపోతుంది. ముందు కాళ్ళ మధ్యలో కూడా వాపు రావొచ్చు.

వ్యాధిని ఎలా నివారించాలి: వర్షాలకు ముందే వ్యాధి నిరోధక టీకాలు వేయడం. చనిపోయిన పశువును గోతిలో పూడ్చాలి. వ్యాధి సోకిన పశువుల మల మూత్రాలను, గడ్డిని కాల్చివేయాలి.

- గాలికుంటు వ్యాధి: సంకరజాతి పశువులలో ఈ వ్యాధి తీవ్రత, దేశవాళి పశువుల్లో కన్నా ఎక్కువగా వుంటుంది.

దేశవాళి పశువుల్లో ప్రాణ నష్టం అంతగా ఉండదు. ఎద్దులు సరిగ్గా పనిచేయవు. మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది.

వ్యాధి లక్షణాలు: నోరు, గిట్టలు మధ్య బొబ్బలు ఏర్పడి, 3.4 వారాల్లో బొబ్బలు చితికి పుండ్లుగా మారి చర్మం గరుకుగా తయారవుతుంది. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. ఎద్దులు వ్యవసాయం చేయలేవు. పశువుల నోటిలో చిగుళ్ళపై పొక్కులు ఏర్పడటం, పశువులు మేత, నీరు తీసుకోక నీరసించి పోతాయి. నోటి నుండి చొంగ కారుతూ వుంటుంది. వ్యాధి పీడిత ఆవులు, గేదెలు పాలు తాగిన దూడలు మరణిస్తాయి.

వ్యాధిని ఎలా నివారించాలి: వ్యాధి సోకిన పశువుల మల మూత్రాలను, గడ్డిని కాల్చివేయాలి. వ్యాది సోకిన పశువుల పాలను దూడలకు తాగించకూడదు.

చికిత్స: కాలి గిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగ్ ద్రావణంతో కడిగి, ఈగలు వాలకుండా వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి.

తీసుకోవలసిన జాగ్రతలు: అధిక వర్షాలు ఉండే ప్రాంతాల్లో రైతులు పాడి పశువులకు గోరువెచ్చని నీటిని అందిస్తే ఫలితాలు బాగుంటాయి. ఈ సమయంలో అధిక పోషకాలున్న దాణాతో పాటు మేలైన పశుగ్రాసాలను అందించాలి. పశుగ్రాసాలను ముక్కలుగా కత్తిరించి, మేపితే గ్రాసం వృథా తగ్గి, పోషకాలు సద్వినియోగం అవుతాయి. వర్షం నుంచి రక్షణకు... కొట్టాల చుట్టూ గోనె సంచులను కట్టాలి. కొట్టాల చుట్టూ నీరు, బురద నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చూడితో ఉన్న పశువులకు పశువైద్యుల సలహా మేరకు అదనంగా పోషకాలు అందించాలి. అవసరమైతే ప్రత్యేక టీకాలు వేయించాలి. నట్టల నివారణకు మందులు తాగించాలి. దూడలకు చల్లటి ఈదురు గాలి తగిలితే న్యుమోనియా వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది. సాయంత్రం వేళ దూడలను త్వరగా కొట్టాల్లో కట్టేయాలి. రాత్రి వేళల్లో పశువులను ఆరుబయట కట్టకుండా వాటికి సంబంధించిన శాలలో కట్టాలి.

జిల్లాలో చికిత్సలయాలు : పశువుల ఆరోగ్యానికి సంబంధించి చికిత్స అందించేందుకు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల చికిత్సాలయాలు ఉన్నాయి. వాటిలో జిల్లా కేంద్రంలో గురజాడ అప్పారావు రోడ్ లో జిల్లా ఆసుపత్రి తో పాటు, 13 ప్రాంతీయ ఆసుపత్రులు, 40 గ్రామీణ పశు ఆసుపత్రులు, 70 పశు వైద్య చికిత్సాలయాలు ఉన్నాయి. మీ పాడి పశువులు ఆరోగ్యానికి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే ఈ ప్రాంతాల్లో ఉన్న చికిత్సాలయాలకు తీసుకువెళ్లి చికిత్స అందించవచ్చు.

ప్రభుత్వ ఆసుపత్రికి ఎమ్మెల్యే బేబీ నాయన సొంత నిధుల వితరణ

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం, ఇందిరమ్మ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) ఆకస్మికంగా సందర్శించారు.. ఆసుపత్రికి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్న నేపథ్యంలో, విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు జనరేటర్ లేనందున ఇబ్బంది కలుగుతున్న విషయం ఎమ్మెల్యే బేబి నాయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ సహకారంతో వీలైనంత త్వరలో జనరేటర్ ఏర్పాటు చేస్తానని తెలిపి, ప్రస్తుతానికి తన సొంత నిధులతో ఇన్వెర్టర్లను ఏర్పాటు చేశారు. సోమవారం ఆ ఇన్వెర్టర్లను ఆసుపత్రి సిబ్బందికి అందజేసి, వాటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబి నాయన పాల్గొన్నారు.అలాగే, త్వరలోనే ఇందిరమ్మ కాలనీకి సోలార్ విద్యుత్ వీధి దీపాలు కూడా ఏర్పాటు చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యే బేబీ నాయన జన్మ దిన సందర్భంగా
రక్తదాన శిబిరంలో 210 యూనిట్లు సేకరణ

విశాలాంధ్ర - బొబ్బిలి : ఎమ్మెల్యేఆర్.వీ. ఎస్.కే.కే.రంగా రావు (బేబీ నాయన) జన్మదినం(రేపు, జూన్ 24) సందర్భంగా ముందురోజు బొబ్బిలి కోటలో దర్బార్ మహల్లో పట్టణ టీడీపీ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రాజుల అభిమానులు పెద్దయెత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని 210 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ రక్తదానంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రక్తదాన శిబిరం కు హాజరైన రక్తదాతలకు ఎమ్మెల్యే బేబి నాయన ప్రతి ఒక్కరిని పలకరించి, రక్తదానం చేసి ఆపదలో ఉన్న విలువైన ప్రాణాలను కాపాడుతున్నందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈరోజుతో కలిపి ఇప్పటికి 90 సార్లు రక్తదానం చేసిన మింది విజయమోహన్ మాస్టారుని సత్కరించి అభినందించారు.ఈ రక్తదాన శిబిరంలో మున్సిపల్ చైర్మన్ రాంబారికి శరత్ బాబు, కౌన్సిల్ సభ్యులు వెలగాడ హైమావతి, మాజీ కౌన్సిల్ సభ్యులు ఏగిరెడ్డి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

శివుకు బంగారయ్య మాస్టారుకు జాతీయ సేవా రత్న, గురు బ్రహ్మ పురస్కారం

విశాలాంధ్ర - నెల్లిమర్ల : నెల్లిమర్ల మండలం జరజాపుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణి త ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న శివుకు బంగారయ్య మాస్టారు కు ఉపాధ్యాయ వృత్తిధర్మాన్ని కొనసాగించడమే కాకుండా, పలు సామాజికసేవలో విశిష్ట సేవలు అందించినందుకు గాను ఆయన ఈ అవార్డు అందుకున్నారు. సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం, ఎల్.బి స్టేడియం, హైదరాబాద్‌లో ఆది వారం ఆల్ ది బెస్ట్ అకాడమీ ఆధ్వర్యం లో ఆల్ ది బెస్ట్ అకాడమీ" వ్యవస్థాపకులు సూర్యనారాయణ మరియు సూర్య తేజ సుబ్రాంత్ చేతుల మీదుగా బంగారయ్య మెమెంటో, శీల్డ్ మరియు ప్రశంసా పత్రాలు అందు కున్నారు.ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ వ్య క్తిగతంగా ప్రతి సంవత్సరం విద్యార్థు లకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్, పరీక్షా కిట్లు, ప్రతిభా పుర స్కారాలు పంపిణీ, విజ్ఞాన విహార యాత్రలు నిర్వహణ, భోజన సౌకర్యం కల్పన, గణితంలో శత శాతం ఫలితాల సాధన, వేసవి కాలంలో ఉపాధి హామీ వేతనదారులకు మజ్జిగ పంపిణీ, అనాథ పిల్లలకు ఆహారం, పండ్లు పంపిణీ, పేద వృద్ధులకు ఉచి త చీరలు పంపిణీ రక్తదానం, అవయవదానం వంటి తదితర సేవా కార్యక్రమాలకు అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు.

అక్కివరం ఆదర్శ పాఠశాలలో 7,8,9,తరగతులకు ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర డెంకాడ: మండలంలోని అక్కివరం వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 7, 8 ,9, తరగతులకు ఖాళీగా ఉన్న సీట్లకు నేడు ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు కావున విద్యార్థులు ముందుగా 9. 30 స్కూల్ కి హాజరు కావలని పాఠశాలలో 7వ తరగతికి 2 సీట్లు 8వ తరగతి 1 సీటు 9వ తరగతి 1 సీట్ ఖాళీగా ఉన్నాయని విద్యార్థులు పరీక్ష సమయానికి హాజరు కావాలని కోరారు.

బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : దేశ సమైక్యత, సమగ్రతల కోసం ప్రాణాలర్పించిన నిస్వార్థ దేశభక్తు డు, జనసంఘ్ వ్యవస్థాపకుడు డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి బలిదానం సందర్భంగా సోమవారం 199 వ బూత్ బీజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఉప్ప లపాటి రాజేష్ వర్మ అతని చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన మహెూన్నతమూర్తి అని, ఏక్ దేశ్ మే దో విధాన్ - ఏక్ దేశ్ మే దో నిశాన్ ఏక్ దేశ్ మే దో ప్రధాన్ నహీ చలేంగే నహీ చలేంగే అంటూకాశ్మీర్ కోసం పోరాడిన మహనీయులన్నారు. వారి జీవిత విశేషాల గురించి , ఆయన దేశం కోసం చేసిన ఎనలేని త్యాగాల గురిం చి నాయకులకు ,కార్యకర్తలకు, ప్రజలకు తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ కన్వీనర్ సంబర లక్ష్మీ నరసింహం , నియోజకవర్గ కన్వీనర్ ఇమంది సుధీర్ , జిల్లా ఆర్.టి.ఐ కన్వీనర్ సిహెచ్ అప్పారావు , ఈస్ట్ మండల అధ్యక్షులు జమ్ము రాంబాబు, మాజీ మండల అధ్యక్షులు కొండల సురే ష్ తదితరులు పాల్గొన్నారు,

స్థలాల ఆక్రమణ లపై నగర పాలక సంస్థ చర్యలు

విశాలాంధ్ర -విజయనగరం : నగరపాలక సంస్థ స్థలాలను ఆక్రమించి పలుచోట్ల ఇసుక, ఇటుక, పిక్క వంటి వ్యాపారాలను తక్షణమే తొలగించి వేయాలని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ప్రణాళిక సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు. నగరంలో సుమారు 20 ప్రాంతాలలో అనధికార ఇసుక, ఇటుక, పిక్క వంటి విక్రయాలు సాగుతున్నట్లు గుర్తించామని చెప్పారు. వాటిని రెండు రోజుల్లోగా తొలగించే విధంగా సంబంధిత వ్యాపారస్తులకు తెలియచెప్పాలని లేనియెడల కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. రహదారులకు ఆనుకుని ఉన్న ప్రాంతాలను ఆక్రమిస్తూ ఇటువంటి వ్యాపారాల సాగుతున్నట్లు గుర్తించామన్నారు. వీటివల్ల ట్రాఫిక్ నకు అంతరాయం తో పాటు, నగర క్రమబద్ధీకరణకు విఘాతం కలుగుతుందన్నారు. ఇసుక,ఇటుక, పిక్క వంటివి రోడ్లపైకి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయని అన్నారు. కావున అనుమతులు లేని ఇటువంటి విక్రయ కేంద్రాలను తక్షణమే తొలగించుకోవాలని సూచించారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
నగర పాలక కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర -విజయనగరం : కాలానుగుణ వ్యాధులు, వైరల్ కారక వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. ఆయన ఆదేశాలతో పలు వాటర్ ట్యాంకులను సోమవారం పరిశుభ్రపరిచే కార్యక్రమాలను సిబ్బంది చేపట్టారు. సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. అలాగే ప్రజలకు కూడా మరింత అప్రమ త్తంగా ఉండి సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వేడి వేడి పదార్థాలను మాత్రమే తీసుకోవాలని చెప్పారు. మున్సిపల్ కుళాయిల ద్వారా వచ్చిన నీటిని వేడి చేసుకున్న తర్వాత మాత్రమే తీసుకోవాలన్నారు. తినుబండారాల పై మూతలను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. దోమలు, ఈగలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్రతి 15 రోజులకోసారి వాటర్ ట్యాంకులను పరిశుభ్రపరిచే కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ప్రజలు రెండు బుట్టల విధానం పాటించాలి
నగర పాలక కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం: నగర ప్రజలు తప్పనిసరిగా రెండు బుట్టల విధానాన్ని అవలంబించాల్సిందేనని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం ఆయన పలు ప్రాంతాలలో పర్యటించారు. పారిశుద్ధ్య విధానాన్ని గమనించారు. చెత్త తరలించే వాహనాలు నిర్ణీత సమయానికి వస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. అలాగే ఇంటింటి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతోంది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు రెండు బుట్టల విధానాన్ని పాటించాలన్నారు. తడి చెత్త పొడి చెత్తలను వర్గీకరించి తమ వద్దకు వచ్చే చెత్త తరలించే వాహనాలకు అందివ్వాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బంది కూడా ప్రజలలో రెండు బుట్టల విధానంపై పూర్తి అవగాహన తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం అన్నా క్యాంటీన్ కు చేరుకుని ప్రజలకు అందుతున్న ఆహారం పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. అన్నా కాంటీన్ పరిసరాల పరిశుభ్రతను గమనించారు.

బాధితుల సమస్యలను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలి
జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేం దుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత సోమవారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి అదనపు ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగావిని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు

వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీగారు 43 ఫిర్యాదులను స్వీకరించారు.స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 15, కుటుంబ కలహాలకు సంబంధించినవి 4, మోసాలకు పాల్పడినట్లు 7, ఇతర అంశాలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను అదనపు ఎస్పీ ఆదేశించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7 దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను

పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న

చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసుకార్యాలయానికి పం పాలని సంబంధిత పోలీసు అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి. ఆర్.కే.చౌదరి, డిసిఆర్బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐప్రభావతి సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు బేసిక్ వేతనాలు ఇవ్వాలి
సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

విశాలాంధ్ర విజయనగరం టౌన్ మున్సిపల్ ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్, పర్యావరణ, ఎలక్ట్రికల్ , నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం 21000, టెక్నికల్ వేతనం 24,500 చెల్లించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. . ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ. జగన్మోహన్రావు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ నాన్ పీహెచ్ కార్మికులకు 21000, టెక్నికల్ వేతనం 24500/- జీతాలు పెంచుతూ ప్రభుత్వం తక్షణమే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటర్మెంట్ బెనిఫిట్, 62 సంవత్సరాల వరకు కొనసాగింపు, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ కార్మికులతో సమానంగా వేతనాలు ప్రతినెల 10వ తేదీలోపు చెల్లించాలన్నారు. థర్డ్ పార్టీ కార్మికులకు ఇప్పటికి రెండు నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని, ఈఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా అమలు కావడం లేదని, పండగ ,జాతీయ సెలవు దినాలు వర్తింప చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమ స్యల పైన ప్రభుత్వం ,అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందిరాలన్నారు. కేంద్రంలో మోడీ ,రాష్ట్రంలో చంద్రబాబు కార్పొరేట్ అనుకూల కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని, అందులో భాగంగానే ఎనిమిది గంటల పని దినాన్ని 10 గంటలకు పెం

చుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ అమలు తక్షణమే నిలిపేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా జులై 9న జరుగుతున్న సమ్మెలో మున్సిపల్ కార్మికు లందరూ పాల్గొంటున్నారని తెలిపారు. ధర్నా లో యూనియన్ నాయకులు ఎస్ రామనాయుడు ఎస్ రాజు, ఆదినారాయణ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు. .

నేడు విద్యుత్ అంతరాయం

గుర్ల: ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు 33/11kv గుర్ల సబ్ స్టేషన్ పరిధిలో వున్న 11కేవీ అచ్యుతా పురం ఫీడర్ పై గల తెట్టంగి , పోలాయవలస, తాతావారికిట్టలి , పెనుబర్తి, అచ్చుతాపురం, రాజుల పేట, చింతపల్లి పేట, గంగిoడ్లపేట,గ్రామాలకు క్రొత్తగా లైన్ వేయుట కొరకు RDSS పని నిమిత్తము విద్యుత్కు అంతరాయము కలుగును. ఈ విషయమును. డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. త్రినాధరావు తెలిపారు

ప్రభుత్వ ఆసుపత్రిలో వాటర్ ప్యూరిఫైయర్ యూనిట్, ఇన్వర్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బేబి నాయన

విశాలాంధ్ర - బొబ్బిలి : ప్ర భుత్వ ఆసుపత్రిలో స్థానిక గ్రోత్ సెంటర్ కార్బన్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ప్రభుత్వ ఆసుపత్రికి సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా అందజేసిన రోగులకు త్రాగు నీరు అందించేందుకు వాటర్ ప్యూరిఫైయర్, విద్యుత్తు లేని సమయంలో విద్యుత్తును అందించేందుకు ఇన్వర్టర్ ను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే బేబి నాయన పాల్గొని వాటర్ ప్యూరిఫైయర్ ను ఇన్వర్టర్ ను ప్రారంభించారు. సామాజిక సేవలో ముందంజలో ఉంటున్న కార్బన్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్య ప్రతినిధి మిత్రేశ్వర షా , పరిశ్రమ సిబ్బందిని ఎమ్మెల్యే బేబి నాయన సేవలను కొనియాడుతూ సుమారు రెండు లక్షల 45 వేల రూపాయలు లతో ప్రభుత్వాసుపత్రి లో రోగులకు అవసరమైన వాటర్ ప్యూరిఫైయర్ ను ఇన్వర్టర్ ను వితరణ చేశారని వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆసుపత్రి సూపరెంట్ గేదేల శశి భూషణరావు వైద్యులు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, వార్డు కౌన్సిల్ సభ్యులు మరిపి తిరుపతి నాయుడు, ఆసుపత్రి సూపరెంట్ గేదేల శశి భూష ణరావు, ప్రభుత్వ వైద్యులు కృష్ణకుమార్, టిడిపి నాయకులు భాస్కర రావు, ఎంపీడీవో రవికుమార్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

విశాలాంధ్ర- విజయనగరం : నగరంలో వివిధ అభివృద్ధి పనులను 3.82 కోట్ల రూపాయలతో చేపట్టేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. సోమవారం విజయనగరం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 13 అంశాలను పొందుపరిచారు. పలు అంశాలపై సభ్యులు చర్చించిన అనంతరం ఒకటి మినహా మిగిలిన 12 అంశాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో పలు డివిజన్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నామని అన్నారు. ఇందుకోసం 3.82 రెండు కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో అధికారులు జాబితాను సిద్ధం చేశారన్నారు. దీనిపై స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు చర్చించిన అనంతరం ఆమోదం లభించిందన్నారు. అలాగే ఈ మధ్య నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడంలో అధికారులు చూపిన కృషిని అభినందిస్తున్నట్లు తెలిపారు. కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొలన్నారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ వి వి రాజేష్, సుంకరి నారాయణస్వామి, జివి రంగారావు, రేగాన రూపా దేవి, కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర డెంకాడ: డెంకాడ మండల పరిధిలోని చింతలవలస ఐదో బెటాలియన్ ఎదురుగానున్న రహదారిపై సోమవారం తెల్లవారుజామున కారు ఢీకొని హెడ్ కానిస్టేబుల్ కు తీవ్ర గాయాల య్యాయి. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై ఆరంగి సన్యాసి నాయుడు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐదో బెటాలియన్ లో హెడ్ కానిస్టేబుల్‌గా కోరాడ రాము నాయుడు విధులు నిర్వహిస్తున్నారు, రాము నాయుడు సత్యనారాయణపురంలో నివసిస్తూ ఉన్నారు. సోమవారం ఉదయం డ్యూటీ నిమిత్తము ఇంటి నుండి మోటార్ సైకిల్ పై వెళ్తూ రోడ్డు దాటుతుండగా విజయనగరం నుండి వైజాగ్ వైపు వెళ్లే కారు అతి వేగముగా వచ్చి ఢీ కొట్టడంతో రోడ్డు ప్రక్కన ఉన్న తుప్పల్లోకి ఎగిరిపడ్డారు. దీంతో తలకు తీవ్ర గాయం కాగా, కాలు చెయ్యి నుజ్జునుజ్జయింది. వెంటనే మెయిన్ గేట్ లో డ్యూటీ చేస్తున్న సిబ్బంది ఇతరులు రక్తస్రావరంలో ఉన్న అతన్ని విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు, అయితే పరిస్థితి విష మించడంతో మెరుగైన వైద్యం కోసంవిశాఖపట్నం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇంత ప్రమాదం జరిగినా కారు ఆపకుండా వెళ్లిపోవడం తో డెంకాడ పోలీసులు నెల్లిమర్ల వాసిదిగా గుర్తించారు. ప్రస్తుతానికి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిజిఆర్ఎస్ కు 166 వినతులు
జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస మూర్తి

విశాలాంధ్ర విజయనగరం టౌన్ ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని, ఇంకనూ చూడవలసిన కాలం లో ఎప్పుడు చూసినా సున్నా కనవడాలని జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస మూర్తి తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ లో డి.ఆర్.ఓ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని ఆదేశించారు. సోమవారం పిజిఆర్ఎస్ కు 166 వినతులు అందాయి. డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు విజయనగరం ఆర్.డి.ఓ సవరమ్మ, పౌర సరఫరాల డి.ఎం బొడ్డేపల్లి శాంతి ,

డి.ఈ.ఓ మాణిక్యం నాయుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 166 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభం దించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 69 వినతులు అందాయి. పంచాయతిశాఖ కు 17 , పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 22 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 5 , వి ద్యా శాఖకు 15, హౌసింగ్ కు 2 అందగా , వైద్య శాఖకు 04, విద్యుత్ శాఖకు 4 అందగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి.

వాకర్స్ క్లబ్ ఆత్మీయ సమ్మేళన

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రమైన విజయనగరంలో వాకర్స్ క్లబ్ లు సంయుక్తంగా సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన్ లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్థానిక బాలాజీ నగర్ లో ఉన్న ప్రజా గ్రంథాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయనగరం పట్టణంలోని పలు వాకర్స్ క్లబ్ లకు చెందిన మహిళలు, పురుషులు, పిల్లలు పాల్గొని సంగీత, సాహిత్య రంగాలలో వారి ప్రతిభను ప్రదర్శించారు. సినిమా పాట లకు చిన్నపిల్లలడాన్సులు వేస్తే, మహిళలు దేశభక్తి గీతాలను ఆల పించారు. కొంతమంది హాస్య భరతమైన స్కిట్లను ప్రదర్శించారు. మరి కొంతమంది పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పట్టణానికి చెందిన వనిత వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ, బాలాజీ వాకర్స్ క్లబ్, తోష్ని వాల్ వాకర్స్ క్లబ్, సాయి కృష్ణ వాకర్స్ క్లబ్, ఈవినింగ్ వాకర్స్ క్లబ్, ప్రగతి వాకర్స్ తోపాటు అనేక క్లబ్ ల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. తమ ప్రతిభను ప్రదర్శించిన వారికి క్లబ్ అధ్యక్షులు, గవర్నర్ , పూర్వపు గవర్నర్ల చేతుల మీదుగా

బహుమతులను అందజేశారు. అనంతరం క్లబ్ పూర్వపు గవర్నర్ లు, పూర్వపు అధ్యక్షులకు సత్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వపు గవర్నర్ లు ఫోర్ ఎస్ రాజు, కృష్ణంరాజు, ఎర్నాయుడు, డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్రా దేవి, జామి అప్పలసూరి, ప్రతినిధులు చిరంజీవి రావు , నాగలక్ష్మి, పప్పు విశ్వనాథం, వెచ్చ సత్యనారాయణమూర్తి, శ్రీనివాస రెడ్డి, ఆదియ్య మాస్టారు, జనార్ధన రావు, రామరాజు సన్యాసిరాజు, తిరుపతిరావు, ఏఎస్ ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు. వాకర్స్ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వైయస్సార్సీపి యువత విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ

విశాలాంధ్ర విజయనగరం టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువత విభాగం ఆధ్వర్యంలోసోమవారంవిజయనగరం జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుండి యువత , విద్యార్థులు నాయకులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులకు మద్దతుగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన,విద్యాదీవెన కింద ఇవ్వాల్సిన బకాయిలు, నిరుద్యోగ యువతకు రూ. 3,000 భృతి చెల్లించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా యువజన విభాగం అధ్యక్షులు అల్లు అవినాష్ ,స్టూడెంట్ విభాగం అధ్యక్షులు కరుమజ్జి సాయికుమార్ ,జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఈశ్వర కౌశిక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా చంద్రబాబు మోసం చేశారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఏవి? ఉపాధి ఎక్కడ? ప్రభుత్వంలోకి వచ్చి వెంటనే తన కొడుక్కి మంత్రి పదవి ఇచ్చిన చంద్రబాబు, ఈ రాష్ట్ర యువతను గాలికి వదిలేసి అన్యాయం చేశారన్నారు. సంవత్సరం గడిచినా మీరు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ఎక్కడ చంద్రబాబు అంటూ ప్రశ్నించారు. ఎన్నికలు ముందు అమలుకాని హామీలు ఇవ్వటం ఎన్నికలు అయ్యాక గాలికి వదిలేయటం చంద్రబాబుకి పరిపాటి అని విమర్శించారు. ఇదే స్ఫూర్తితో యువత ఉద్యమం కొనసాగుతుంది అని,యువత హక్కుల సాధన కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ యువజన విభాగం పోరాటాన్ని మరింత ఉధృతం చేయనుంది అని హెచ్చరించారు. ఇప్పటికే ఎన్నికల్లో అనేక హామీలను ఇచ్చి వాటిని అమలు చేయలేక ప్రజలకు మోసం చేసిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీరందరికీ న్యాయం చేయాలన్నారు ఈ కార్యక్రమంలోచీపురుపల్లి నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీ కృష్ణ,జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంత్, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పతివాడ సత్యనారాయణ, రాష్ట్ర పార్టీ కార్యవర్గం సభ్యులు,జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, జిల్లా సోషల్ మీడియా కార్యవర్గ సభ్యులు, 7 అసెంబ్లీ నియోజకవర్గాల అనుబంధ విభాగాలు అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు,ముఖ్య నాయకులు ,సీనియర్ నాయకులు ఇతర ప్రజా ప్రతినిధుల తదితరులు పాల్గొన్నారు.

2న వర్చువల్ డాక్ అదాలత్

విశాలాంధ్ర విజయనగరం టౌన్ పోస్టల్ సేవలకు సంబంధించిన ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి జూలై 2 న ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్, విజయవాడ లో సర్కిల్ స్థాయి ఆన్లైన్ డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ కె .శ్రీనివాస్ తెలిపారు. ఆరోజు ఉదయం 11. 00 గంటల నుండి గూగుల్ మీట్ ద్వారా జరుగుతుందని ఆ యన ఒక ప్రకటనలో తెలియజేశారు.పోస్టల్ శాఖకు సంబందించి రాష్ట్ర ప్రజలు వారి ఫిర్యాదులను జూన్ 27 వ తేదీ లోపల చేరేలా పోస్ట్ ద్వారా ఎస్. నీలంరాజు రంగారావు, అసిస్టెంట్ డైరెక్టర్ (పబ్లిక్ గ్రీవెన్స్), చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఎ సర్కిల్, విజయవాడ-520013 కు పంపవచ్చునని తెలిపారు. లేఖలు మరియు ఎన్వలప్‌లపై "డాక్ అదాలత్" అనే పదాలు స్పష్టంగా వ్రాయాలని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తేది.02.07.2025న ఉదయం 11:00 గంటలకు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ-13 వద్ద డాక్ అదాలత్ కు నేరుగా కూడా హాజరై ఫిర్యాదులు సమర్పించవచ్చని తెలియజేశారు. డాక్ అదాలత్ ను వర్చువల్‌గా గూగుల్ మీట్ లింక్ ద్వారా నిర్వహిస్తున్నారని, ఫిర్యాదుదారులు https:// meet. google.com/uxo-yocn-rdh లింకు ద్వారా జూలై 2వ తేదీ ఉదయం 11:00 డాక్ అదాలత్‌కు తమ సమస్యలను తెలియజేయవచ్చునని సూచించారు. ఫిర్యాదును పరిశీలించిన తర్వాత ఫిర్యాదు పరిష్కారం ఫిర్యాదుదారునికి పోస్ట్/ఇమెయిల్ ద్వారా తెలియజేయబడుతుందని ఆయన తెలిపారు.

24 న 7,8,9వ తరగతులకు ప్రవేశ పరీక్షలు

విశాలాంధ్ర(తెర్లాం): మండ లం లో పెరుమాలి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి లక్ష్మి విలేకర్ల తో ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ 24.06.25 వ తేదీ న ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 వరకు 7,8,9 వ తరగతులకు అడ్మిషన్స్ టెస్ట్ నిర్వహించ బడు తుంది అని, సరయిన సమయానికి విద్యార్థులు హాజరు కావాలని పెరుమాలి ఆదర్శ పాఠశాల ప్రిన్సి పాల్ జ్యోతి లక్ష్మి విలేకర్ల తో సోమవారం తెలిపారు.

అమెరికా స్వలాభం కోసమే యుద్ధాలు

పాలస్తానీకు అండగా నిలుద్దాంసదస్సులో అజశర్మ పిలుపు
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: నేడు ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు అమెరికా యుద్ధ సామగ్రి అమ్మకాలు చేసి లాభాలు కోసం,స్వలాభం కోసం మరొకటి కాదని,అమెరికా దూరంకారానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఏ.అజ శర్మ పిలుపునిచ్చారు. సోమవారం ఎస్ ఎఫ్ ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ ఎఫ్ ఐ అఖిల భారత మహాసభలు సందర్భంగా స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ప్రపంచ యుద్ధాలు పర్యవసానాలు పాలస్తీనాకు సంగీభావం అనే అంశంపై సదస్సు జరిగింది. ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము అధ్యక్షతన జరిగిన సదస్సులో ముందుగా యుద్ధాల్లో మరణించిన వారికి సదస్సు నివాళులు అర్పించింది. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఏ. అజశర్మ మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాల్లో జరుగుతున్న యుద్ధాలు అన్ని అమెరికా ప్రోత్సాహంతో జరుగుతున్నావేనని అన్నారు. ప్రపంచ దేశాల్లో ఇజ్రాయెల్, ఇరాన్, దేశాలు మధ్య యుద్ధం జరుతుంది.అదే విధంగా దేశంలో మణిపూర్ లో కూడా రెండు తేగలు మధ్య జరుగుతున్నాయన్నారు. శ్రీ శ్రీ చెప్పినట్లుగా ఏ దేశ చరిత్ర చూసిన ఏమున్నది గర్వ కారణం అని చెప్పిన విధంగా ఉందన్నారు. యుద్ధాల్లో గర్వించదానికి ఏమున్నది మనుషలను మనుషలను చంపుకోవడం తప్ప అన్నారు. ఈ యుద్ధాలు అనేవి ఎందుకు జరుగుతున్నాయి అనేది పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.20 శతాబ్దంలో మూడు వందలు పైగా యుద్ధాలు జరిగాయి. వాటిని ద్వారా గుణపాఠాలు నేర్చుకోవడం జరుగుతుందన్నారు. మొదటి ప్రపంచ యుద్ధం,రెండో ప్రపంచ యుద్ధాలు జరిగాయన్నారు. దీర్ఘ కాలం అమెరికాకు వియత్నాం కు మధ్య జరిగిన యుద్ధం, కొరియా యుద్ధం, ప్రస్తుతం రష్యా ,ఉక్రెయిన యుద్ధం మూడేళ్ల పాటు జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఇజ్రాయిల్,ఇరాన్ మధ్య యుద్ధం జరుగుతుంది. ఇజ్రాయిల్ కి మద్దతుగా ఇరాన్ మీద అమెరికా బాంబులు వేయడం జరిగిందన్నారు. ప్రపంచ యుద్ధంలో అమెరికా అణుబాంబు జపాన్ పై వేసి ప్రపంచాన్ని బయటపెట్టే ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. దీంతో చాలా దేశాలు అణుబాంబు లు తయారు చేయడం జరిగిందన్నారు. జపాన్ లో అణు బాంబు పరిణామాలు నేటికి కనబడుతున్నాయన్నారు. అత్యధికంగా 4309 అణుబాంబులు రష్యా దేశంలో ఉన్నాయన్నారు. ప్రత్యర్థులను బెదిరించడానికి ఈ బాంబులు ఉంచుకోవడం జరుగుతున్నాయన్నారు. ఇలా చాలా దేశాల్లో అణు బాంబులు ఉంచుకోవడం జరిగింది. ఇరాన్ దేశం అణు బాంబులు తయారు చేస్తున్నదని చెప్పి నేడు ఇజ్రాయిల్ యుద్ధం చేస్తుందన్నారు. అణు బాంబులు అనేది ప్రపంచానికి మంచిది కాదన్నారు. కానీ ఆ పేరుతో ఇరాన్ పై దాడి అన్యాయమన్నారు.ప్రపంచంలో మత ,ఆర్థిక, రాజకీయ పరమైన యుద్ధాలు జరిగాయన్నారు.ఆదిపత్యం కోసం జరిగినవే యుద్ధాలు అన్నారు. మనిషి ప్రాణం తీయడం అనేది నేరమన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఏడు కోట్ల మంది మరణించడం జరిగిందన్నారు. శత వర్ష యుద్ధం 116 ఏళ్లపాటు ఇంగ్లండ్ కి,ఫ్రాన్స్ కి మధ్య జరిగింది. వియత్నాం యుద్ధం ఫ్రెంచ్ దేశం నుంచి స్వాతంత్ర్యం కోసం యుద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఏ యుద్ధం జరిగినా అమెరికా పాత్ర ఉంటుందన్నారు. పాక్ ఇండియా మధ్య జరిగిన యుద్ధం ఆగిపోవడానికి అమెరికా అణ్వాయుధాలు పాకిస్తాన్లో ఉండటం వలన యుద్ధం ఆగిందన్నారు. గాజా మీద దాడి చేసి పసిపిల్లలను చంపేస్తున్న ఇజ్రాయిల్ కి అమెరికా మద్దతు ఇస్తుందన్నారు. ఇది అన్యాయమని అడగాల్సిన మన దేశం న్యాయం వైపు కాకుండా, మన దేశ విదేశాంగ విధానంలో మార్పు చేసి ఇజ్రాయిల్ కి మద్దతుగా అన్యాయమవైపు నిలబడిందన్నారు.

అనంతరం ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ మాట్లాడుతూ ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు తెలుసుకోవడం ద్వారా మనం ఎక్కడ ఉన్నామో తెలుస్తుందన్నారు. అమెరికా భారతీయులను సంకెళ్లు వేసి పంపిస్తున్న విషయం గమనించాలన్నారు. అనేక సాఫ్ట్వేర్ కంపెనీలు ఉద్యోగులను తొలగించేస్తున్నారన్నారు. .బట్టలు లేని స్తితి నుంచి బట్టలు వేసుకునే స్థాయికి, ఆదిమ సమాజం నుంచి నేటికి మానవుడు మార్పులు చేసుకుంటూ సుఖ జీవితం కోసం అనేక మార్పులు చేసుకుంటూ రావడం జరిగిందన్నారు. నేడు జరుగుతున్న ఇరాన్,ఇజ్రాయిల్ యుద్ధం వలన కూడాయిల ధరలు పెరిగి మన ప్రజలపై భారాలు పడనున్నాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పది లక్షలు ఉద్యోగాలు అన్నారు దాని గురించి మనం ఆలోచించడం లేదన్నారు. మన భవిష్యత్ కోసం ఆలోచించుకోవాల్సిన అవసరముందన్నారు. సదస్సులో ఎస్ ఎఫ్ ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్,ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం శ్రీనివాస, గర్ల్స్ కో కన్వీనర్ శిరీష నాయకులు,అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.ఎస్ ఎఫ్ ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్,ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం శ్రీనివాస, గర్ల్స్ కో కన్వీనర్ శిరీష నాయకులు,అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు వరి విత్తనాల పంపిణీ

గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు

విశాలాంధ్ర – వేపాడ: మండలంలోని సింగరాయి గ్రామ సచివాలయంలో రాయితీపై రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు అన్నారు. సోమవారం సింగరాయి సచివాలయం పరిధిలోని సింగరాయి, కొత్త సింగరాయి, జగ్గయ్యపేట, అరిగిపాలేం, గ్రామాలకు చెందిన రైతులకు ఆయన చేతుల మీదుగా వరి వత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తుల షాపులలో విత్తనాలను కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోవద్దని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు రాయితీపై విత్తనాలు అందిస్తుందని ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అరిగిపాలెం టిడిపి

నాయకులు మాజీ ఎంపీటీసీ దుల్ల వెంకటరమణ, సచివాలయ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ కే.కోమలత, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలుపై అప్రమత్తంగా ఉండాలి

పల్లె నిద్రలో సీఐ ఉపేంద్రరావు

విశాలాంధ్ర – వంగర: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు సూచించారు. ఆదివారం మండలంలో సంగాం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమంను నిర్వహించారు. అర్ధరాత్రి ఆయన ఆ గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే వర్క్ ఫ్రం హెూం అంటూ కొందరు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు, యువత తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ, సీవీవీ నెంబర్లు, పాస్వర్డ్ ఎవ్వరికి తెలియజేయరా దన్నారు. మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు తలెత్తుతాయన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల మీ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అదేవిధంగా ఎవ్వరూ పరిచయం లేని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దన్నారు. గుర్తు తెలియని వారికి వ్యక్తిగత సమాచారాన్ని ఇస్తే నష్ట పోక తప్పదన్నారు. గ్రామంలో సైబర్ నేరాల నివారణపై ఆయన అవగాహన కల్పించారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతే కాకుండా వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజకీయ తగాదాలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ, సర్పంచ్ ప్రతినిధి గేదెల రామకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర – రామభద్రపురం: సుదీర్ఘంగా ఉన్న సర్వేయర్ల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సర్వేయర్లు తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. జీవో ఎంఎస్ నెంబరు 1 ప్రకారము సర్వేయర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. జీవో ఎంఎస్ ఎం 161 ప్రకారము గ్రేడ్ 3 నుండి 2 2కి పదవి తగ్గించడం చాలా దారుణమని అన్నారు. రీ సర్వేలో ఇవ్వవలసిన పెండింగ్ బిల్లులను తక్షణమే ఈ ప్రభుత్వ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలని పరిష్కరించుకుంటే ఈ నెల 25న నల్ల బ్యాడ్జీలతో మండల కేంద్రాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న 17 సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.

నేటి నుండి ఆధార్ ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర – వంగర: మండలంలో మంగళవారం నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘునాథచారి తెలిపారు. మండల కేంద్రం వంగర, కింజంగి, అరసాడ, కొప్పరవలస గ్రామ సచివాలయాల్లో ఈనెల 27 వరకూ స్పెషల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కొత్త ఆధార్ కోసం, ఆధార్ అప్డేట్, బయోమెట్రిక్, డేట్ అఫ్ బర్త్ అప్‌డేట్, ఫోన్ నంబర్ లింక్ వంటి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. లక్ష్మి బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర – రామభద్రపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా సోమవారం జి.లక్ష్మి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈమె పక్కి ఆరోగ్య కేంద్రంలో పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని అన్నారు.